# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **"మిషన్ కర్మయోగి"లో భాగంగా విజయవాడలో నిర్వహిస్తున్న కార్యశాలను కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.**

2. **నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **ఏనుగుల సంచారం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.**

4. **గ్రామాల సర్వతోముఖ అభివృద్ధే పల్లె పండుగ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.**

==========================

"మిషన్ కర్మయోగి"లో భాగంగా శిక్షణ సంస్థలను సమర్థవంతమైన సామర్థ్య నిర్మాణ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ దేశవ్యాప్తంగా ప్రాంతీయ సంప్రదింపుల కార్యశాలలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 'సాధన శృంఖల 2026' పేరుతో నిర్వహిస్తున్న తొలి దక్షిణ ప్రాంతీయ కార్యశాల సమావేశం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఈరోజు, రేపు జరగనుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరికి చెందిన సీనియర్ అధికారులు, శిక్షణ సంస్థల అధిపతులు, బోధనా సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు, నిపుణులు ఈ కార్యశాలలో పాల్గొననున్నారు.

--------------------------

దేశంలో నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఒక మీడియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "ది కాన్‌క్లేవ్ 2026" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

--------------------------

ఏనుగుల సంచారం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా పడిపుట్లబైలు సమీపంలో సంచరిస్తున్న ఏనుగులను సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు  కుంకీ ఏనుగులను వినియోగించాలని సూచించారు. ఏనుగుల సంచారం ఆధారంగా పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల పరిసర గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజల భద్రత, పంటల పరిరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

-------------------------

దసరా పండుగకు విజయవాడను దేశంలోని ప్రముఖ ఉత్సవ వేదికగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని డా. బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో నిన్న నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ... అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు విజయవాడ ఉత్సవ్-2.0ను నిర్వహించనున్నట్లు చెప్పారు. తోలుబొమ్మలాట, డప్పు, తప్పెటగుళ్లు వంటి జానపద కళారూపాలతో పాటు పౌరాణిక పద్య నాటకాలను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవ్ వేదికగా నిలుస్తుందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

-------------------------

వాయుగుండం ప్రభావంతో దెబ్బతిన్న పంటల నష్టం అంచనాలను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందించాలని అధికారులకు సూచించారు.

-------------------------

గ్రామాల సర్వతోముఖ అభివృద్ధే పల్లె పండుగ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ఈరోజు జరగనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై మంత్రి నారాయణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా గోపవరంలో 55 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్‌ను నిర్మించామని తెలిపారు. వీరికి రాయితీపై విద్యుత్ అందిస్తున్నామని, ఇందుకోసం ఇప్పటివరకు 12 వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు

వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 6 వేల కోట్ల రూపాయల వ్యయంతో సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టామని మంత్రి తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దసరా ఉత్సవ ఏర్పాట్లపై నిన్న విజయవాడలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ప్రాంతాలు, దర్శన మార్గాలను సిద్ధం చేయడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నామని మంత్రి  ఈ సందర్భంగా తెలియజేస్తూ ...

వాయిస్..30.. సెకన్లు

-------------------------

తెలంగాణలో భూ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై వనపర్తిలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి శ్రీనివాసరెడ్డి  పాత్రికేయులతో మాట్లాడుతూ,  భూ భారతి చట్టం హామీ మేరకు ప్రతి భూమికి  ప్రత్యేక గుర్తింపు, మ్యాప్, ల్యాండ్ పార్శిల్ మ్యాప్ నంబర్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. భూ భారతి కింద తొలి దశలో 70 రెవెన్యూ గ్రామాలను సర్వేకు ఎంపిక చేశామని వాటిలో దశలవారీగా సర్వే చేయనున్నట్లు వెల్లడించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని  ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం  తెలిపింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఏర్పాటై 130 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను నిన్న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, విశాఖ రైల్వే స్టేషన్  చరిత్రను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు.

====================